# విజిటింగ్ కార్డ్

లోకం అసలే చెడ్డది. ఇప్పుడు బాగా చెడ్డదై పోయింది. ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో తెలియదు. మంచివాళ్లలా కనిపించే చెడ్డవాళ్లూ, చెడ్డవాళ్లలా కనిపించే మంచివాళ్లూ వుంటారు. గోముఖ వ్యాఘ్రాలు, వ్యాఘ్రముఖగోవులూ వున్నాయి.

విజయనగరంనుంచి విశాఖపట్నం బయలుదేరేను. అక్కణ్నుంచి ఉక్కునగరం క్వార్టర్సులో వున్న అమ్మాయినీ, అల్లుణ్నీ చూడాలని సంకల్పం. విశాఖపట్నం కాంప్లెక్స్‌లోకి బస్సు ప్రవేశించిందో, లేదో "నా పర్సు పోయింది. నా పర్సు పోయింది! బస్సాపండీ" అని అరుపు.

కండక్టరు బస్సు ఆపించి, ప్రయాణికులెవరనీ దిగనీయకుండా తలుపు వేసేసి, కాంప్లెక్స్ ఆవరణలో వున్న పోలీసుఠాణాకి వెళ్లి పోలీసుల్ని పిలిపించుకొచ్చేడు.

పోలీసులు ఒక్కొక్కరి పెట్టెలూ, సంచీలూ విప్పించి పాంటుజేబులు, చొక్కాజేబులు తణిఖీ చేసారు. ఆడపోలీసులు స్త్రీ ప్రయాణికుల్ని సోదా చేసారు.

నా దురదృష్టం ఏమోగాని ఆ పోయిన పర్సేదో నా సంచీలో దొరికింది. దొరికిపోతానన్న భయంతో ఏ ప్ర'బుద్ధుడు' నా సంచీలో పడేసేడో?

పోగొట్టుకున్న వ్యక్తిని ఆ పర్సులో ఎంత డబ్బుందో వివరాలడిగేరు. అతను సరిగ్గా చెప్పేడు.

మిగిలిన ప్రయాణికుల్ని పంపించివేశారు. నన్ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

"ఏమయ్యా! చూడ్డానికి పెద్ద మనిషిలా ఉన్నావ్! ఇదేం పోయేకాలమయ్యా?" అన్నారు ఎస్సైగారు.

"కేడీగాళ్లందరూ పెద్ద మనుషుల్లాగానే ఉంటారండీ! కాకపోతే కొందరికి చారల బనీన్లుండవు. అంతే తేడా" అన్నారు హెడ్డుగారు.

"ఓయ్ ఫోర్ ఫార్టీఫోర్! వీడి పాంటుజేబులూ, చొక్కాజేబులూ అన్నీ సోదా చెయ్యి. ఇంకేమేమి దొంగవస్తువులున్నాయో" అన్నారు ఎస్సైగారు.

నాజేబులు తడిమేరు. మనీపర్సు, అందులో ఓ విజిటింగ్ కార్డుని ఎస్సైకి చూబెట్టేడు హెడ్డు.

ఎస్సై అది చదివి వణకిపోతూ, "సార్! సార్! మమ్మల్ని క్షమించండి సార్" అంటూ నా చేతులు పట్టుకున్నాడు.

ఆ వెంటనే కండక్టర్‌తో "నీకేమైనా బుద్ధుందయ్యా! ఈయనా నీకు దొరికేడు?" అని ఓ అర్ధచంద్ర ప్రయోగం చేసేడు. కండక్టరు దాదాపు నేలతల్లిని ముద్దెట్టుకున్నంతపనయ్యింది.

పర్సు పోగొట్టుకున్న ఆయనకి ఆయన పర్సు, నాకు నా పర్సు ఇచ్చేసేడు.

బతుకుజీవుడా అనుకుంటూ, బయటపడి పర్సు చూసుకున్నాను.

పదిహేను రోజులు కిందట హైదరాబాద్ వెళ్లేను. అక్కడ నా కజిన్ ఉన్నాడు. వాడి విజిటింగ్ కార్డొకటి నాకిచ్చేడు. అదిప్పుడు నా పర్సులో వుంది. అది చూసే ఎస్సై వణికిపోయాడు. దానిమీద...

".... రావు,

క్రైమ్ బ్రాంచ్ సి.ఐ.డి."

అని వుంది. అంతే! ఆ కింద ఆఫీస్ అడ్రస్‌వుంది. వెనుక ఇంటి అడ్రసుంది.

పాపం ఎస్సై.

ఆగస్టు 1994 చతుర